క్లుప్తంగా

క్రీడల్లో రాణించాలి


క్రీడాకారులను పరిచయం చేసుకొంటున్న ఎంఈఓ

రాయచోటి టౌన్ : విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని ఎంఈఓ బాలాజీ నాయక్ అన్నారు. మంగళవారం రాయచోటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-11,అండర్-14,అండర్-17 పోటీలను ఎంఈఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను చదువుతో పాటు క్రీడలపై కూడా మక్కువ పెంచి వారు క్రీడల్లో రాణించే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో ఉర్దూ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామ్మోహన్‌రెడ్డి, పీఆర్‌టీయూ క్రమశిక్షణ సంఘం రాష్ట్ర చైర్మన్ శ్రీనివాస రాజు, క్రీడా కో ఆర్డినేటర్లు నరసరాజు, జగదీశ్వరయ్య, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయుడికి పూజలు

చిన్నమండెం : శ్రావణ మాసం చివరి మంగళవారం కావడంతో మండల కేంద్రంతో పాటు మండల వ్యాప్తంగా ఉన్న పలు అంజనేయ స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా స్వామి వారిని ప్రత్యేక పుష్పాలతో అందంగా అలంకరించి ఆకుపూజలు, సింధూర పూజలను ఆలయ అర్చకులు నిర్వహించారు. వచ్చిన భక్తాదులకు అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు.

బస్టాండ్ నిర్మాణాలు వేగవంతం చేయండి

రాయచోటి టౌన్ : రాయచోటి ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని అన్నమయ్య జిల్లా ఆర్టీసీ రీజనల్ మేనేజర్ రాము అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన రాయచోటి ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణ పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు సూచనలు, సలహాలు చేశారు. పెండింగ్ పనులన్నీ పూర్తి చేసి ఈ నెలాఖరుకు అప్పగించాలని ఆదేశించారు. కార్యక్రమంలో రాయచోటి డిపో మేనేజర్ ధనుంజయ పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం


మాట్లాడుతున్న దేవ శిరోమణి

రాయచోటి టౌన్ : బాల్య వివాహాల నిర్మూలనకు అన్ని శాఖల అధికారులు, తల్లిదండ్రులు కలసికట్టుగా పని చేయాలని డిప్యూటీ డీఈఎంఓ దేవ శిరోమణి అన్నారు. మంగళవారం పీసీపీఎన్‌డీటీ రాష్ట్ర అప్రోప్రియేట్ అథారిటీ విజయవాడ వారి ఆదేశాల మేరకు రాయచోటి కస్తూర్బా గురుకుల పాఠశాలలో ఆడపిల్లల నిష్పత్తి తగ్గితే జరిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె పీఎన్‌డీటీ చట్టంపై అవగాహన కల్పించారు. అలాగే సరైన సమయంలోనే ఆడపిల్లలకు వివాహం చేయాలని తెలియజేశారు. బాల్య వివాహాలను నిర్మూలించడానికి ఎలాంటి జాగ్రత్తలు పాటించాలనే విషయాలపై అవగాహన కల్పించారు. హెల్త్ ఎడ్యుకేటర్ బాలరాజు, ఉషారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే వైద్యం

పుల్లంపేట : రాష్ట్ర ప్రభుత్వం ఇంటి వద్దకే వైద్య సేవలు తీసుకొచ్చిందని పుల్లంపేట డాక్టర్ సానేశేఖర్ అన్నారు. మంగళవారం అనంతంపల్లి గ్రామంలో 104 ద్వారా ప్రజలకు వైద్య సేవలతోపాటు ఉచితంగా మందులు అందించారు. సుమారు 30 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రజలు వైద్యం కోసం వేరే ప్రాంతానికి వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. గ్రామాల్లోనే ఉచితంగా వైద్య సేవలు అందించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పక్కా గృహాల లక్ష్యాలను పూర్తి చేయాలి

సిద్దవటం : మండలంలోని జగనన్న లేఔట్‌లలో పక్కా గృహాల లక్ష్యాలను త్వరితగతిన పనులను పూర్తి చేయించాలని అధికారులకు ఎంపీడీఓ జవహర్‌బాబు సూచించారు. మండలం కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం హౌసింగ్, ఆడుదాం ఆంధ్రా, బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించుట కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ వారంవారం మండలానికి కేటాయించిన హౌసింగ్ స్టేజీ కన్వర్షన్ పనులను లబ్ధిదారులతో త్వరితగతిన పూర్తి చేయించేందుకు సచివాలయ సిబ్బంది ముఖ్య కార్యదర్శులు, వీఆర్‌ఓలు, ఇంజనీరింగ్ సిబ్బంది క్షేత్రస్థాయిలో సహకరించాలన్నారు. అలాగే ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి సంబంధించి నిర్వహించబడే క్రీడలకు క్రీడాకారులను పంచాయతీ కార్యదర్శులు ఫిజికల్ డైరెక్టర్‌లతో సమన్వయం చేసుకొని జాబితాలను సచివాలయాల వారీగా పంపాలన్నారు. బడి ఈడు పిల్లలు ప్రతి ఒక్కరిని తిరిగి పాఠశాలలో చేర్పించే కార్యక్రమంలో ఎంఈఓ, హెడ్‌మాస్టర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్ల ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి

- ప్రతి ఒక్కరూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండాలి
- సోషల్ మీడియా వారియర్స్‌ను సన్మానించిన ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు


ఓబులవారిపల్లె: రెవెన్యూ రికార్డులను పరిశీలిస్తున్న ప్రభుత్వవిప్ కొరముట్ల


రైల్వేకోడూరు: సోషల్ మీడియా కన్వీనర్లను సన్మానించిన ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని సంక్షేమం, అభివృద్ధి పథకాలతో ముందుకు నడిపిస్తుంటే ఓర్వలేని ప్రతిపక్షాలు అనవసరంగా దుష్ప్రచారం చేస్తున్నాయని, సోషల్ మీడియా వేదికగా ప్రతిపక్షాల ఆరోపణలను తిప్పికొట్టాలని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి మీ పాత్ర ఎంతో కీలకమైందన్నారు. ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకువెళ్లి జగనన్న ప్రభుత్వం ముందు జగనన్న ప్రభుత్వం తరువాత అనే విధంగా ఫొటోలతో సూచిస్తూ పోస్టులు చేయాలన్నారు. ఎన్నికల సమయం తక్కువ ఉండటంతో ప్రజలకు మరింతగా చేరువయ్యేందుకు సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండాలని సూచించారు. రాష్ట్రంలో, నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను సోషల్ మీడియా వేదిక ప్రజలకు తెలియజేయాలన్నారు. గత 40 సంవత్సరాల నుంచి జరగని అభివృద్ధి ఈ నాలుగున్నర సంవత్సరాలలో సుమారు రూ. 1200 కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపించామన్నారు. అంతే కాకుండా ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న అనవసర ఆరోపణలను ఖండించడానికి, వారి ప్రచారం అబద్ధం అని ప్రజలకు తెలిసే విధంగా పనిచేయాలన్నారు. నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్త నిత్యం ప్రజల్లో ఉండటానికి రోజూ వారిని కలవడమే కాకుండా, సోషల్ మీడియాను కూడా ఉపయోగించుకోవాలన్నారు. తదనంతరం సోషల్ మీడియా కన్వీనర్లను శాలువాలతో సన్మానించినారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, సిద్దవరం శ్రీనివాసులరెడ్డి, సర్పంచ్ శివయ్య, ఉప సర్పంచ్ తోట సాయి, సాయిగణేష్, చాపల గిరి, మహేంద్ర, హరీష్ నాయుడు, గంగాధర్, వెంకటేష్, హరి, గుణ, నందు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు భూములు ఇవ్వడమే లక్ష్యం

ఓబులవారిపల్లె : అర్హులైన ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఓసీ పేదలకు భూములు పంపిణీ చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రభుత్వ విప్, రెవెన్యూ అధికారులు, ఏపీటీడీసీ డైరెక్టర్ వి.సాయికిషోర్ రెడ్డిలు మండల నాయకులతో కలిసి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులతో ఆయన మాట్లాడుతూ మండలంలో అన్యాక్రాంతమైన భూములను గుర్తించి ఆక్రమణలు తొలగించి అర్హులైన పేదలకు భూములు పంచేందుకు సిద్ధం చేయాలన్నారు. మంగళంపల్లి, పెద్దఓరంపాడు రెవెన్యూ పరిధిలో భూ పంపిణీకి ప్రభుత్వ భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించి సర్వే చేయించి, భూములను గుర్తించాలన్నారు. ఇందుకు సంబంధించిన రికార్డులను ఆయన పరిశీలించి రెవెన్యూ అధికారులకు పలు సూచనలు, సలహాలు చేశారు. అనంతరం చిన్నఓరంపాడు జెడ్‌హెచ్‌డీసీ భూములకు సంబంధించి పేదలకు పట్టాలు ఇచ్చే విధంగా పూర్తిస్థాయిలో రికార్డులను పరిశీలించి అక్రమాలకు పాల్పడి ఉంటే భూములను స్వాధీనం చేసుకోవాలని తెలియజేశారు. గత కొన్నేళ్లుగా ఇబ్బందులు పడుతున్న కమ్మపల్లి దళితవాడ రైతుల సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. సాయికిషోర్ రెడ్డి మాట్లాడుతూ ఆన్‌లైన్‌కు సంబంధించి రైతులు సంవత్సరాలుగా ఇబ్బందులు పడుతున్నారని, క్షేత్రస్థాయిలో రైతుల భూములను పరిశీలించి ఆన్‌లైన్ చేయాలని కోరారు. మండలంలో పలు రెవెన్యూ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ పుల్లారెడ్డిని ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ముక్కా రమేష్ కుమార్ రెడ్డి, మాజీ సింగల్ విండో అధ్యక్షుడు టంగుటూరు కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ-1 గుడూరు గౌరీశంకర్ రాజు, సర్పంచ్ లౌడి గంగురాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు సుకుమార్, సర్వేయర్ భవానీ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు పట్టాలివ్వండి


మంత్రికి సమస్యను తెలుపుతున్న నాయకులు

వీరబల్లె(రాయచోటి టౌన్) : వీరబల్లె మండలం షికారు పాలెంలో నివాసం ఉండే గిరిజనులకు అటవీ హక్కుల చట్టం ప్రకారం ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలివ్వాలని గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బక్కె విశ్వనాథనాయక్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి వినతి పత్రాన్ని గిరిజన సంఘాల నాయకులు అందజేశారు.

గ్రామంలో అర్హులందరికీ పింఛన్లు


కొత్త పింఛన్‌దారులతో సర్పంచ్ మోహనమ్మ

పెనగలూరు : గ్రామంలో అర్హులందరికీ పింఛన్లు మంజూరయ్యాయని కట్టావారిపల్లె సర్పంచ్ మోహనమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకుడు శివయ్య నాయుడులు అన్నారు. మంగళవారం కట్టావారిపల్లి పంచాయతీలో కొత్తగా మంజూరైన 28 కొత్త పింఛన్లు పంపిణీ చేశాన్నారు. పింఛన్లు మంజూరు చేసిన సీఎం జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

సబ్సిడీ ఉలవలను సద్వినియోగం చేసుకోండి


రాయచోటి టౌన్: వీరబల్లె మండలం మట్లి గ్రామంలో సబ్సిడీ ఉలవలను అందజేస్తున్న సర్పంచ్


చిన్నమండెం: రైతులకు ఉలవలను పంపిణీ చేస్తున్న దేవనాథరెడ్డి

రాయచోటి టౌన్ : తమ పొలంలో ఉలవలు సాగు చేస్తామని విత్తన రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు మాత్రమే విత్తన ఉలవలు అందజేస్తామని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. మంగళవారం రాయచోటి రూరల్ పరిధిలోని పెమ్మాడపల్లెలో రైతులకు సబ్సిడీ ఉలవలు పంపిణీ చేశారు. ప్రభుత్వం 80 సబ్సిడీతో అందిస్తున్న ఉలవలు అన్ని గ్రామాలలోని రైతు భరోసా కేంద్రాల వద్ద రైతులకు అందిస్తున్నామని వారు తెలిపారు. ఇందులో 10 కిలలో ఉలవుల ధర రూ.1080 కాగా రైతులు 20 శాతం (రూ.216) చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. రైతు భరోసా కేంద్రానికి వచ్చే రైతులు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, మొబైల్ తప్పకుండా తీసుకొచ్చి కేంద్రంలో బయోమెట్రిక్ ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు.

రైతుల ప్రభుత్వమిది

చిన్నమండెం : వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం రైతుల ప్రభుత్వమని జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డి పేర్కొన్నారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో రైతులకు మంజూరైన ఉలవలను మంగళవారం పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన దేవనాథరెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ ఎప్పుడూ రైతుల పక్షాన నిలబడి వారిని అనేక రకాలుగా ఆదుకుంటున్నారని తెలిపారు. అదే విధంగా ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి సహకారంతో మండలానికి 184 క్వింటాళ్ల ఉలవలు మంజూరయ్యాయని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగపరచుకోవాలని ఆయన కోరారు. ఏఓగీత, సర్పంచులు ముసల్‌రెడ్డి, దామోదర్, లోకేశ్వర్‌రెడ్డి, అఫ్రోజ్, వైఎసోఆర్‌సీపీ నాయకులు యెహియాఖాన్, చుక్కా అంజనప్ప, రైతులు పాల్గొన్నారు.

వీరబల్లె (రాయచోటి టౌన్) : ఖరీఫ్‌లో సాగు చేసేందుకు ప్రభుత్వం అందించే సబ్సిడీ ఉలవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మట్లి సర్పంచ్ సోమారపు నాగార్జునాచారి సూచించారు. మంగళవారం మట్లి గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో రైతులకు సబ్సిడీ విత్తనాలను ఆయన అందించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు మేలు చేయాలనే సంకల్పంతో 80శాతం సబ్సిడీతో అందిస్తోందని తెలిపారు. వీటిని తమ పొలాల్లో విత్తుకొని సాగు చేసుకోవాలని తెలిపారు. స్వల్ప వర్షపాతానికే దిగుబడి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో గుదే నాగభూషణం నాయుడు, చెన్నకేశవులు, ధర్మయ్య, సురేష్ నాయుడు, పర్వతరెడ్డి, కణితి వెంకట్రాము, పెసలు రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

రైల్వేకోడూరు అర్బన్ : వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం పైన సీఐ మధుసూదన్‌రెడ్డితో కలిసి పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి మాట్లాడుతూ వినాయక మండలికి పోలీసు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. కులమతాలకు అతీతంగా చవితి వేడుకలను జరుపుకోవాలని కోరారు. మండలంలో శాంతియుతంగానే అనేక పండుగలు జరిగాయని గుర్తుచేశారు. అదే విధంగా గణేష్ ఉత్సవాలనూ జరుపుకోవాలని తెలిపారు. వినాయక మండపాలు ఏర్పాటు చేసుకునే కమిటీ సభ్యులు పోలీసు, పంచాయతీ, విద్యుత్, అగ్నిమాపక శాఖ అనుమతులు తీసుకోవాలని సూచించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ ప్రైవేటు స్థలాల్లో విగ్రహాన్ని ఏర్పాటుచేసే కమిటీపై శాఖల అనుమతి లేనిదే కూర్చొబెట్టరాదన్నారు. మసీదులు, చర్చీల వద్ద ఎలాంటి సౌండ్లు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు, ధ్వనులు చేయరాదన్నారు. నిమజ్జనం ఎక్కడ చేస్తారో కూడా దరఖాస్తులో వివరించాలని చెప్పారు. నిబంధనలు పాటించని వారు ఎంతటి వారైనా వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచ్ శివయ్య, ఉప సర్పంచ్ తోట శివసాయి, జిల్లా కో-ఆప్షన్ సభ్యులు వైఎస్ అన్వర్‌బాషా, ముజీబ్, సీహెచ్ రమేష్, రమణారెడ్డి, రాజారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, పంచాయతీరాజ్ డీఈ బాలనరసింహులు, ఎస్ఐ మోహన్‌కుమార్‌గౌడ్, కామేశ్వరరావు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

పుల్లంపేట : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని పుల్లంపేట ఎస్ఐ రఘురాం తెలిపారు. మంగళవారం సాయంత్రం వినాయక చవితి కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రఘురాం మాట్లాడుతూ హిందూ, ముస్లింలు కలిసికట్టుగా వినాయక చవితిని జరుపుకోవాలని, ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. ప్రతి ఒక్కరూ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని తెలిపారు.

పెనగలూరు : వినాయక చవితికి గ్రామాలలో విగ్రహాలు పెట్టేవారు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ సుబ్బారెడ్డి తెలిపారు. మంగళవారం గ్రామాలలోని పెద్ద మనుషులతో పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో విగ్రహాలు పెట్టేవారు పోలీసుల అనుమతితోపాటు విద్యుత్‌శాఖ అనుమతి తప్పనిసరి అన్నారు. గ్రామాలలో ఎలాంటి గొడవలు లేకుండా శాంతియుతంగా ఉత్సవాలను జరుపుకునేందుకు పెద్దమనుషుల తోపాటు కమిటీ సభ్యులు సహకరించాలన్నారు. మైక్ కావాలంటే డీఎస్పీ అనుమతి తీసుకోవాలన్నారు. అలాగే వినాయక చవితికి డ్యాన్సు ప్రోగ్రామ్‌లకు అనుమతి లేదన్నారు. వినాయక మండపాలు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఏర్పాటు చేసుకోవాలన్నారు. నిమజ్జన కార్యక్రమంలో మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

చిట్వేలి : వినాయక చవితి ఉత్సవాల సమయంలో పోలీసులకు సహకరిస్తూ ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎస్ఐ సుభాష్ చంద్రబోస్ నిర్వాహకులకు పిలుపునిచ్చారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. అలాగే ప్రభుత్వ స్థలమైతే పంచాయతీ, ప్రైవేటు స్థలమైతే ఆయా యజమానుల అనుమతి తీసుకోవాలన్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా మండపాన్ని ఏర్పాటు చేసుకోవాలని, విద్యుత్ శాఖవారి అనుమతి, దీపారాధన విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సుభాష్ చంద్రబోస్ హెచ్చరించారు.

ఆరోగ్య సురక్షతో ప్రజారోగ్యం పటిష్టం

- సమస్యల పరిష్కారంలో అధికారులు అలసత్వం వీడాలి
- రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

ఒంటిమిట్ట : రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ఆరోగ్య సురక్ష అనే కార్యక్రమంతో ప్రజల ఆరోగ్యం పటిష్టంగా ఉంటుందని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో మండల వైస్ ఎంపీపీ గెడ్డం జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి హాజరయ్యారు. ముందుగా మండల పరిధిలోని సాలాబాద్ గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం సర్వసభ్య సమావేశంలో మండలంలో ప్రజా సమస్యలపై ప్రజాప్రతినిధులను వివరణ అడిగి తెలుసుకున్నారు. అలాగే మండల అన్ని శాఖ అధికారులను ఇది వరకు మండల సర్వసభ్య సమావేశంలో లేవనెత్తిన సమస్యల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. కొంత మంది ప్రజాప్రతినిధులు ఇదివరకు సమావేశంలో లేవనెత్తిన సమస్యలే పరిష్కారం కాలేదని చెప్పడంతో అధికారులను ఎమ్మెల్యే మందలించారు. తీరు మారకుంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. అలాగే సమావేశానికి గైర్హాజరైన అధికారులు, సిబ్బందికి మెమో పంపాలని ఎంపీడీఓను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ అధికారి ప్రజలకు జవాబుదారీతనంగా నడుచుకోవాలని సూచించారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు నెలకొన్న సందర్భంగా తాగునీటి అందించే విషయంలో శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల శాఖ కార్పొరేషన్ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి, కో-ఆప్షన్ మెంబర్ రఫీ, ఎంపీటీసీలు చెంచుగార్ల సుప్రియ, ముమ్మడి నారాయణరెడ్డి, పిడుగు వెంకటలక్షుమ్మ, టక్కోలు లక్ష్మీప్రసన్న, బాషా, సర్పంచులు కత్తి సుజాత, మేరువ శివనారాయణ, పన్నెల రామలక్షుమ్మ, బాదుల్లా, ఎంపీడీఓ రెడ్డయ్య, తహసీల్దార్ మాధవీలత, ఈఓపీఆర్‌డీ రంగయ్య, మండల అధికారులు పాల్గొన్నారు.

నాటుసారా రహిత గ్రామంగా తీర్చిదిద్దడమే ధ్యేయం


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఈబీ సీఐ ధీరజ్ రెడ్డి

సంబేపల్లె : మండల పరిధిలోని శెట్టిపల్లె పంచాయతీ పెద్దబిడికిలో నాటుసారాపై ఎస్ఈబీ సీఐ ధీరజ్ రెడ్డి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా నాటుసారా తయారు చేసినా, అమ్మినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సారా రహిత గ్రామంగా తీర్చిదిద్దడమే తమ ధ్యేయమని సీఐ తెలిపారు.

జెండా మోసిన వారికే ప్రాధాన్యమివ్వాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: కేంద్రంలో, రాష్ట్రంలో పార్టీని వీడకుండా జెండా మోసిన వారికి అధిష్ఠానం పెద్దపీట వేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్ డిమాండ్ చేశారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లను భరించి, ఎన్నో కేసులు మీద వేసుకున్న వారికి సముచిత న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు పాలగిరి శివ, బాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి అర్హుడు ఓటు హక్కు పొందాలి

ఒంటిమిట్ట : బతికి ఉండగానే తాను చనిపోయానంటూ జెడ్పీ సీఈఓ కార్యాలయం నుంచి పరిశీలనకు మైగ్రేటెడ్, డెత్ వెరిఫికేషన్ లిస్ట్ వచ్చిందని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డికి ఒంటిమిట్ట వైస్ ఎంపీపీ గీతా దేవి ఫిర్యాదు చేశారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో జరుగుతున్న సర్వసభ్య సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన రాజంపేట ఎమ్మెల్యే మేడాకు విషయాన్ని తెలియజేశారు. ఈ విషయమై మండల తహసీల్దార్ మాధవీలతను సీరియస్‌గా తీసుకుని ఇలాంటి తప్పిదాలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మండలం ప్రతి అర్హుడికి ఓటు హక్కు ఉండాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. ఇలాంటి పొరపాట్లు దొర్లకుండా బీఎల్ఓలు, వీఆర్ఓలకు జాగ్రత్తలు తెలియజేయాలని తహసీల్దారుకు ఎమ్మెల్యే తెలియజేశారు. కాగా మండలంలో 1100 పైచిలుకు ఓట్ల తొలగించాలంటూ వివిధ కారణాలుగా ఫిర్యాదులు అందగా అందులో 50 శాతం బతికి ఉన్న వారినే చనిపోయినట్టు ఫిర్యాదులు అందినట్టు తెలుస్తోంది.

పకడ్బందీగా ఈ- పంట వివరాల నమోదు


లింగంపల్లెలోని పొలంలో నమోదు చేస్తున్న ఈ- పంట వివరాలను పరిశీలిస్తున్న అధికారి

సిద్దవటం : మండలంలోని టక్కోలి రైతు భరోసా కేంద్రాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశామని బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం. నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులను పరిశీలించి తగు సూచనలు సలహాలు చేశారు. అంతేగాకుండా ఎరువుల పంపిణీ, ఈ - పంట నమోదు రిజిస్టర్‌లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సచివాలయ గోడౌన్‌లో రసాయనిక ఎరువులను పరిశీలించామన్నారు. యూరియా 228 బస్తాలు, 14:35:14 11 బస్తాలు ఎరువులు ఉన్నాయన్నారు. అవసరమైన రైతులు ఈ ఎరువులను పొందవచ్చునన్నారు. ఇప్పటికే ఈ - పంట నమోదు చేసిన సర్వే నంబర్లు, విస్తీర్ణం, నీటి వనరులు, సాగువిధానం అమలు తదితర అంశాలను ఎంపిక చేసిన రైతుల పొలాలను సూపర్‌వైజరీ చెక్ చేయడం జరిగిందన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ విధానాలు, అమలు తీరు తెన్నులపై సదరు సిబ్బందితో చర్చించామన్నారు. మంగళవాండ్లపల్లెకు చెందిన ఆదర్శ రైతు నారపురెడ్డి యానాదిరెడ్డికి చెందిన మామిడి, జామ తోటలో ప్రకృతి వ్యవసాయ విధానాలు ప్రయోగాత్మకంగా చేపట్టాలని, ఫలితాలను తోటి రైతులకు వివరించి ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించాలని సూచించారు. కడపాయపల్లి, లింగంపల్లి, టక్కోలి గ్రామాలల్లోని పలు రైతుల పొలాలను సందర్శించి ఈ - పంట నమోదు వివరాలను తనిఖీ చేసినట్టు తెలియజేశారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

రామాపురం : హసనపురం పంచాయతీ యర్రంగివాండ్లపల్లె హరిజనవాడలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నరసింహులు, నియోజకవర్గ కార్యదర్శి శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం ఆ గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంపీడీఓకు వినతి పత్రంను సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ దాదాపు ఐదు సంవత్సరాలుగా 50 దళిత కుటుంబాలు తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుంటే స్థానిక నాయకులుగానీ, మండలానికి చెందిన ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టకపోవడాన్ని తప్పుబట్టారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక దృష్టి సారించి దళితవాడకు తాగునీటి కష్టాలను శాశ్వత పరిష్కారించాలన్నారు. లేనిపక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద రిలే నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీ మహిళా సమైక్య జిల్లా ప్రధాన కార్యదిర్శ సుమిత్ర, రైతు సంఘం జిల్లా కార్యదర్శి రంగారెడ్డి, డీహెచ్‌పీఎస్ నాయకులు సుధాకర్, రమణ, దళితవాడ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

లెఫ్టినెంట్ కల్నల్‌కు సన్మానం


అభిషేక్ రెడ్డి, తల్లిదండ్రులను సన్మానించిన దృశ్యం

చిట్వేలి : మైలపల్లికి చెందిన లెఫ్టినెంట్ కల్నల్ ముద్దా అభిషేక్ రెడ్డిని స్థానిక చెన్నకేశవస్వామి ఆలయంలో మంగళవారం మానవత సంస్థ సభ్యులు సన్మానించారు. ఆయనతోపాటు తల్లిదండ్రులైన రాధికారెడ్డి, రవికుమార్ రెడ్డిలనూ సన్మానించారు. అభిషేక్ రెడ్డి లెఫ్టినెంట్ కల్నల్‌గా రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ఎంపికకావడం మండల వాసులకు ఎంతో గర్వకారణమన్నారు.

ఘనంగా పోషకాహార మాసోత్సవాలు


పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న సూపర్‌వైజర్

పుల్లంపేట : మండలంలోని కొమ్మనవారిపల్లి సచివాలయం పరిధిలోని అంగన్‌వాడీ సెంటర్‌లో మంగళవారం పోషకాహార మహోత్సవాన్ని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మలాదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, పిల్లల తల్లులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించామన్నారు. ప్రభుత్వం అందించే పాలు, గుడ్లు, చిక్కీలు, తదితర పోషకాలతో కూడిన ఆహార పదార్థాలను బాలింతలకు అందించారు. బాలింతలకు క్రమం తప్పకుండా ప్రతి మాసంలో అంగన్‌వాడీ సెంటర్‌లో ఉచితంగా పౌష్టికాహార పదార్థాలు తీసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ రాములమ్మ, ప్రమీల, పార్వతీ, తదితరులు పాల్గొన్నారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన సదస్సు

రామాపురం : మండల పరిషత్ సభా భవనంలో బుధవారం ఉదయం 11.30గంటలకు జగనన్న ఆరోగ్య సురక్ష పథకంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ హైదర్‌వలి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, ఎంపీటీసీలు, మండలశాఖ అధికారులు, సచివాలయం స్పెషల్ అధికారులు, విద్య, ఆరోగ్య, ఐసీడీఎస్ సిబ్బంది హాజరుకావాలని సూచించారు.